# బంగారక్క లు

"ఒరేయి! అబ్బాయిగారి సుబ్బాయి ! నె సూసింది నువ్వు సూశా వురా? ఒరేయి ఒరేయి!" అని లబలబలాడాడు లక్ష్మీకె లచ్చన్న.

"ఉం! ఉం!" అన్నాను నేను.

"అదిరా ! నేనంది అదిరా— ఆ గుంటరా! దగ్గిరకొచ్చి నన్నాడు అన్నట్లు డెరేసు ఏసుకున్న ఆ గుంటరా! ఒట్టెట్టుకు సెబుతాను అది డెరేసు తీయడానికి పటకార్లు ఉపయోగిత్తుందను కుంటారా ?" అన్నాడు లక్ష్మీకె.

"ఓ అదా' ఛమించు! నేనుంకోటనుకున్నా. ఆ స్టాకింగు కిందికి తీసి పైకి లాగుతున్నదే! ఆ బాము! అదనుకున్నా!" అన్నాను నేను.

రైలు జోరుగా పోతూ జాన్సీ టేషన్‌లో ఆగింది.

"తప్పుకోండి! తప్పుకోండి! కోడె! కోడె ! అవును సూడ్నండి !" అంటూ గెన్నరు గురుమూర్తిగాడు పేం కిటికీలోంచి చూత్తుండే మా

యిద్దరి మద్దెనూ సేరాడు, మోసేతుల్తో మస్మల్ని పొడుత్తూ. ఈకెలు తీసిన కోడివంటి ఆడి తలకాయ సైటపెట్టాడు.

"ఓయ్! ఎందుకాగుతారోయి! సూడు సూడండి రోల్సున్నాయి! కేకులున్నాయి. చా వుంది. ఇంకెందు కాగటం? పదండోయి పదండి! పెసాదంరా! పదండీ!" అంటూ బండి తలుపు తీయబోయాడు. గుద్ది గుద్ది ఏం తెలియనోడు మాదిరిగా సూశాడు.

"ఒరేయి నల్లమందు భాయి! మన్నిందులో పెట్టి జాన్సీ దాకా లాకప్ సేశారని మరిసిపోయావా? కిందటి టేషనులో మనం సేసిన అల్లరి మరిసి పోయావా? అతగాడు ఆర్. టి. వో. గాడు రావాలి, తలుపు తీయాలి" అన్నాను నేను.

సంపొచ్చే వాడల్లే గన్నరుగాడికి కోపం వచ్చింది. "ఎందుకురా కొత్త కూత్తె అల్లరికే మన్ని లాకపూ?" అన్నాడు.

"ఎందుకా? బండిలోంచి దూకుతామేమో! లాకపు సేయకపోతే జాన్సీలో మన నంబర్లు నోటు సేసుకునేదెట్లా? సెలవునుంచి రెజిమెంటు రాంగానే ప్యాక్ డ్రిల్ ఇచ్చేదెట్లా?" అన్నాడు లచ్మికెగాడు.

ఎనక్కెళ్ళామో ముందు కెళ్తన్నామో తెలీలే....యచవలు ఎనకాలి టేషనోళ్ళు, లటుక్కున పెట్టెలో పెట్టి లాకప్ అన్నారు. ఆర్టీవో రాడేం!

మాకన్నబడ్డ బంగారక్కలు ముగ్గురు. యాళ్ళోరకం వ్యాకెలు. ఆ అదుగో, కనబడుతున్న ష్టాలులో మాబోంటి చిపాయిలకు ఉత్తిగనే చా వగయిరా లిత్తారు. ఐతే నేనూ లచ్మికెగాడూ కొంసెం కళాశాత్రం సదువు కున్నోళ్ళం. అందుకనే మాకా కేకు వగైరాలమీదికి మనస్సు పోలేదు. ఆ పనంతా గురుమూర్తిగాడిదే-యేది మొదలెట్టితే దానిమీదే ఉంటుంది ఆడి దుష్టి. మా దుష్టి ఆ బంగారక్కలమీద వాలింది.

ఓ పోర్టరుబైతు ప్లాటుఫారం ఊడుత్తుండాడు. "ఓయి కేతిగా !" అని పిలిశాడు గన్నరుగాడు.

"నన్నా పిలిసింది? నా పేరు కేతిగాడు కాదు - తెలుసా ? యెవరను కుంటుండావు నువు? దిగొచ్చినోడల్లే ! నువ్వా నీ ఓయి కేతిగాడు !" అన్నాడాడు.

"ఓకే, ఓకే బుల్లివాడూ! పోనీలే-మన్మదుడని పిలుత్తారు గాబోలులే నిన్ను-సరే కాని యీ తలుపు తీత్తావా?" అన్నాడు గన్నరు.

"నా కదికారంలేదు. నా దగ్గిర తాళాసెవిలేదు. నా మనస్సులో ఇట్టమూ లేదు. జాగర్తగా మాట్టాడు. వదరుబోతల్లే ఉండావు. రైల్వే అంతా నువ్వే అన్నట్టు ఆడర్ చేత్తుండావే!" అన్నాడు ఆ పోర్టరు.

"పోవోయి పోవోయి. ఆ సీపురు కట్టపెట్టి నోటి కదుముకు పో! ఆ! అడుగోరా ఆర్టీవో!" అన్నాడు లబ్మికె.

ఆర్టీవో వచ్చి తలుపు తీశాడు. మా కిట్ బ్యాగులు బుజానేసుకుని ఆడికి మా నంబల్లిచ్చాం. ఇక్కడే రైలుమారాలి. మా రైలుకింకా టైముంది. ఈలోపుగా ఆ బంగారక్కల బంగారం కొంసెం పరీచ్చిద్దాం అనుకుని గబ గబ ఆళ్ళ ష్టాలు దగ్గిరకు పోయాం.

నేనా? అటు జరిగి యిటు జరిగి ఆ బంగారక్కల యవకాలేపు - ఆళ్ళంటారే 'ష్ట్రాటజిక్ పొజిషన్' అని అట్టా నుంచున్నాం. ఏదో కాత్తో కూత్తో సందు సూసుకుని సాటుగా మాట్టాడొచ్చు అని.

"ఇంటివద్ద అంతా బాగుండారా పిల్లా ?" అని అడిగానందులో ఓ గుంటను-స్నేహంగా, చనవుగా.

"నాతో మాట్టాడుతుండావా సిపాయీ? లేక నీ ముందర పళ్ళేమైనా రాలినయ్యా?" అంది.

"హాహాహా! నవ్వించే మాటలు మాట్టాడుతుంటావు!" అన్నాను నేను.

"నువ్వా యనకనుంచి ముందుకు పద" అన్నది.

"ఆగు ఆగు. చ్నేహంగా అంటే కోప్పడకు!" అన్నాను.

"ముందేపు వత్తావా రావా? ఈ టీపాయితో నెత్తిమీదెయ్యనా?" అంది.

ముందుకొచ్చి "సూట్రా ఏం మాట్టాడినా అట్టా కస్సుమంటుందేం? మిలిటరోళ్ళు, యీ మద్దె సిపాయిలు సెలవుల్లో ఇంట్లకెత్తంటే ఆవ్వానం జరుగుతుందెక్కడి కెళ్ళినా అన్నారు. సూడీ అవ్వానం!" అన్నాను లచ్మికెతో.

"నాకెంతాక లేత్తుందంటే — బూట్లనే మింగేద్దా మన్నంత!" అంటూ మెల్లిగా బల్లదగ్గిరకొచ్చి ఓ ప్లేటు కేకులను తీయబోయాడు గన్నరు.

ముట్టుకున్నాడో లేదో కాళీప్లేటుతో ఆ రెండో బంగారక్క కటిక్కన అడి సేతిమీద కొట్టింది.

"ముట్టుకోవాకండి. ఎనక్కుండండి. తొందర పడకండి. ఇవి బహుమానంగా ఊరికే ఇచ్చే పదార్దాలు, మీ జేబుల్లో డబ్బులుపెట్టి కొనేవోళ్ళల్లే సేతులెట్టకండి. కబడ్డార్!" అంది ఆ రెండో బంగారక్క.

"నిజం నిజం వదినే! కొంతమందికి ఎట్టా మెలగాలో తెలీదు, సిగ్గు లేదు నీకు గన్నర్?" అన్నాడు లచ్మికెగాడు, ఆడైనా దయతో సూత్తారేమో అని.

"నీ సిఫారసు అక్కర్లేదోయి. నువ్వేదో కలగలుపు కొత్తుంటావు. నీ కెవరు సెప్పారు. పదా నువు గూడా ఆ క్యూలోనుంచో!—ఊ!" అంది ఆ బంగారక్క.

"అవునే చంద్రా! యీళ్ళంతా పెద్ద మొగాళ్ళ మనుకుంటారు. ఈళ్ళ వల్లే యీ యుద్ధం జయిత్తామనుకుంటారు — షోగ్గా ఎక్కడి కెళ్ళినా ఫ్రీ చా యీళ్ళకి. మనకో? మనం సెలవుల కింద్ల కెత్తేనో! ఛీ!" అంటూ నేలమీ దుమ్మేసింది ఆ బంగారక్క.

"మనమంతా యాందో ! ఎవరమో అనుకుంటా రీళ్ళు" అంది చంద్రం.

"ఏం గల్లంతు ఏం గల్లంతు! కూత్తా గాత్తానా! బమ్మంత గల్లంతు" అన్నాడు గన్నరు.

"సూడక్కా ! మా క్కావల్సిందంతా...." అనబోయాడు లచ్చిమికె ంచ్చన్న.

"సూడే సూడే చంద్రం! ఈడికి నేనక్కనైతే ఎంటనే బావిలో పడే దాన్ని! యీడూ యీడి మొగమూనూ!" అంది ఆ బంగారక్క.

"సూడండి! మాక్కావల్సింది ఓ బన్నూ చా— సాలు!" అన్నాడు గురుమూర్తి.

"ఆడిక్కావలిట. పెపంచంలో ఇంకెవరూ లేరు. ఆడే, ఆడిక్కావా లిట సూడే" అన్నదా బంగారక్క.

"రోజూ వొందలా దొస్తారిక్కడికి. మంచిగా మాట్లాత్తారు. మంచిగా పోతారు. ఇట్టా అవమానిత్తారా?" అన్నది కూడా.

"అవమానాలన్నీ నువ్వే ఇత్తుండావు. మేమేమీ అన్లే" అన్నాను.

"ఉత్తిగనే మీది కొత్తుండావు" అన్నాడు లచ్చిమికెగాడు నా కొత్తాసిగా.

పెళ పెళా అన్నాయి ప్లేట్లు. ఆడి మొగం తగలెయ్య ఆ గురు మూర్తిగాడి ఆరాటం. మేము మాటాడుతూనే వుండాం మెల్లంగా రెండు బన్నులు లంకించుకోపోయాడు కామోసు. ఆడి మోచేయి ప్లేట్ల దొంతరకు తగిలింది కామోసు. పెళ పెళా ఆ ఆక్సిడెంటు.

"పోలీసు! పోలీసు! ఓయి ఎంపీలు, ఓయి!" అని కేకేసింది మూడో బంగారక్క.

ఏమవుతున్నదో మేమెక్కడుండామో ఇవరంగా తెలీకుండానే వచ్చి పడ్డారు ఇద్దరు ఎంపీలు. ఆళ్ళ బాహువుల్లో సిక్కాం.

"ఏంటిదీ? మేమేం సేశాం? పొరపాటు పడుతున్నారు!" అన్నాను నేను.

"మేం సెలవుల కిండ్లకు పోతుండాం. మాతో సెల్లాట్టమా? ఊరుకోండి!" అన్నాడు లక్ష్మికె.

"ఒరేయి రైలుకు ఏళయిందిరా, రైలు తప్పిపోతుందిరా, పదండి" అన్నాడు గన్నరు.

"మాది పొరబాటా? రైలు తప్పుతుందేం? ఆటుగాదు ఇటుంది గేటు. ఈ గేటులోంచి పోయి రెండు రోజులు సుట్టరికం సేద్దురు గాని, రండి!" అన్నాడు ఒక ఎంపీగాడు.

అంతటితో మమ్మన్ని ముందుకు మార్చి సేశారు.

"థాంక్సు నాయుడూ!" అంది చంద్ర- ఒక ఎంపీగాడ్ని కామోలు.

"థాంక్సు స్వామీ!" అంది రెండో బంగారక్క - రెండోవాడికి కామోలు.

"పరవాలేదు, సినిమా కాలస్సెంగా రావాకు ఊ!" అన్నాడు నాయుడు ఆళ్ళతో.

"ఓరేయి! ఈళ్ళు వ్యక్తైలుగార్రా వాక్కాయల్రా!" అన్నాడు లక్ష్మికె.

"అవునురా! పుల్లంగా పొగరొగరుగా—" అన్నాను.